# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### కాంగ్రెసోళ్లు అధికారంలోకి వచ్చుడు కల్లే..



ఉట్నూర్, నవంబర్ 23 : రేవంత్‌రెడ్డి ఎవుసానికి మూడు గంటల కరెంటే చాలంటున్నడు. 10హెచ్‌పీ మోటర్లు పెడుతమంటున్నడు. గీ పని అయ్యేదేనా. మంచిగున్న రైతులను ఆగం చేసేందుకే ఆయన ఇష్టమచ్చినట్టు మాట్లాడవట్టే. మూడు గంటల కరెంటుతో ఒక మడన్న పారుతదా. కాంగ్రెస్ పాలనల నీళ్లు, కరెంటు లేక భూములు అమ్ముకొని చానా మంది వలసకు పోయిన్రు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు 24గంటల కరెంటు ఇయ్యవట్టే. పుష్కలంగా నీళ్లు ఇస్తాండాయె. గిప్పుడు చానా మంది ఊళ్లలో ఎవుసం చేస్తున్నరు. సంతోషంగా ఉన్నరు. **- లావుడ్య పరుశురాం, కొత్తగూడ(చక్‌పోస్ట్), రైతు**

### గతంలో చేసిన అన్యాయం చాలదా?



ఉట్నూర్, నవంబర్ 23 : కాంగ్రెసోళ్లు గతంలో రైతులకు చేసిన అన్యాయం చాలదా..? మళ్లా ఏదో చేస్తమని జూస్తున్నరు. వీళ్లకు పాలన చేత కాదు. ఎవుసం అంటే తెల్వదు. రైతు ఎట్ల బతుకుతుండో తెల్వదు. వీళ్ల పొట్టలు మాత్రం నిండాలె. 10 హెచ్‌పీ మోటర్ పెట్టి నీళ్ల ఇగ్గాలట. గా మోటర్ గీ కాంగ్రెస్ లీడర్లు కొనిస్తరా..? కాంగ్రెసోళ్లు అధకారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. వీళ్లిప్పుడే గింతగానం చేస్తున్నరంటే, ఇగ ప్రజలకు మంచి చేసుడైతే ఉండది. మూడు గంటల కరెంటిచ్చి మళ్లీ గోస పెట్టే కాంగ్రెస్‌కు రైతులెవ్వరూ ఓటెయ్యరు. ఇగ వాళ్ల పని ఖతం. **-జాడి అజయ్,వ్యాపారి, ఉట్నూర్.**

### 10 హెచ్‌పీ మోటర్లతో ఇబ్బందే..



ఉట్నూర్, నవంబర్ 23 : వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటార్ ఏ మాత్రం ఉపయోగపడదు. 5 లేదా 3 హెచ్‌పీ మోటర్లు బిగించుకుంటే సరిపోతుంది. రేవంత్‌రెడ్డి తెలియక మాట్లాడుతుండో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు తప్పలేదు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండే. రైతులను ఆగం చేసే పార్టీలు ఉండకూడదు. సీఎం కేసీఆర్ హయాంలో రైతులు సంబురంగా వ్యవసాయం చేసుకుంటుండ్రు. రైతులకు కరెంట్ కష్టాలు ఏమాత్రం లేవు. **- ఆడె రవీందర్, ఎలక్ట్రిషియన్**



### ఎవుసం చేసుడు కష్టం..

సొనాల, నవంబర్ 23 : కాంగ్రెస్ చెబుతున్నట్లు 10హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేయడం చాలా కష్టం. అధి సన్న, చిన్న కారు రైతులకు భారం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంట్ పగలు ఇస్తారా..?రాత్రి ఇస్తారా..? చెప్పడం లేదు. రైతులు 3, 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని వ్యవసాయం చేస్తుండ్రు. 10హెచ్‌పీ మోటర్ అనేది పరిశ్రమల్లో వాడుతారు. కాంగ్రెస్ రైతులను అయోమయంలో పడేస్తుంది. 10హెచ్‌పీ మోటర్ పెడితే ట్రాన్స్‌ఫార్మర్ల మీద ఒకేసారి లోడ్ పడుతుంది. అప్పుడు లోఓల్టేజీ ఏర్పడి మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. మళ్లీ పాతరోజులు వస్తాయి. వ్యవసాయంలో నష్టం వచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల పాటు రైతులకు ఉచితంగా కరెంట్ ఇస్తున్నది. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నష్టపోతారు. **- ఆనంద్, రైతు, సొనాల, గుట్టపక్క తండా**



### మా బతుకులు పొలంలోనే తెల్లార్తయ్..

వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే మా బతుకులు పొలంలోనే తెల్లార్తయి. ఎప్పుడు కరెంట్ వస్తదో.. పొలం పారవెట్టుకుందామా అని పొలంలోనే ఉండాల్సి వస్తది. కాంగ్రెసోళ్లు వ్యవసాయం గురించి మాట్లాడితే గిట్లనే ఉంటది. ఇప్పుడు 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని ఉచిత సలహా ఇస్తుండ్రు. ఇప్పుడున్న బోర్లు నడుస్తున్నాయి కాదా. మరిమళ్లీ 10 హెచ్‌పీ మోటర్లు కొనమని చెప్పుడు చూస్తుంటే. రైతుల మీద భారం పడాలని ఈ కాంగ్రెస్ చూస్తున్నట్లు అనిపిస్తున్నది. మా పంటలు పండుతున్నాయి.నీళ్లు పారుతున్నాయి. మేమంతా మంచిగానే ఉన్నాం. మీ అధికారం కోసం ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరైంది కాదు. కాంగ్రెస్ గెలిచేది లేదు. సచ్చేది లేదు.
**- పంద్రం శ్రీకాంత్, రైతు, రాయిగూడ, సిరికొండ మండలం**



**10 హెచ్‌పీ మోటర్లు కాంగ్రెసోళ్లే కొనిస్తరా..?**

ఉట్నూర్, నవంబర్ 23: పల్లెటూర్లలో ఉండే రైతులు విత్తనాలు, ఎరువులు కొనేందుకే పరేషాన్‌లో ఉంటరు. అటువంటి రైతులు అసలు 10 హెచ్‌పీ మోటర్ ఎట్ల కొంటరు. ఆ మోటర్‌ను మెయింటన్ చేయాలంటే అధికంగా విద్యుత్ ఖర్చు అవుతది. దానికి తగ్గట్లు మోటర్ పరికరాలు కావాలె. నీళ్లు కూడ అదే స్థాయిలో ఉండాలె. చాలా మట్టుకు అంతపెద్ద మోటర్ బిగించరు. దాని రిపేర్ ఖర్చులు కూడా ఎక్కువగనే ఉంటయ్. మా ఏరియాలో ఎక్కడ కూడా 10 హెచ్‌పీ మోటర్ ఏ రైతు బిగించలే. ఎవుసానికి అంత పెద్ద మోటర్ కూడ అవసరం లేదు. ఖర్చు బాగా అయితది. ఈ కాంగ్రెసోళ్ల మాటలు వింటే విచిత్రమనిపిస్తున్నది. వీళ్లకు ఆ ఎవుసం గురించి తెల్వదు.. పోదు. గందుకే రైతులెవ్వలూ కాంగ్రెస్‌కు ఓటెయ్యరు.
**- గుమ్ముల అనిల్, మోటర్ మెకానిక్, ఉట్నూర్**

### మీటర్లు వెడుతరటా..



ఉట్నూర్, నవంబర్ 23 : వ్యవసాయం ఖర్చుతో కూడుకున్నది. ఏజెన్సీ ఏరియాలో అసలే నీటి కొరత ఉంటది. 10 హెచ్‌పీ మోటర్ వెడితే క్షణాల్లో నీటిని తోడేస్తయ్. అందుకే 10 హెచ్‌పీ వాడరు. వ్యవసాయలో 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ సరిపోద్ది. 10 హెచ్‌పీ లోడ్‌ను తట్టుకునే ట్రాన్సఫార్మర్లు కూడా పెట్టాలె. ఇదంతా రైతుల మీదనే పడుతది. ఇగ కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ ఎవుసం బోర్ల కాడ మీటర్లు కూడా పెడుతరు. మొన్న నిర్మల సీతారామన్ కూడా గదే చెప్పింది. కాంగ్రెసోళ్లు కూడా మీటర్లు పెడుతున్నరని. మనకాడ కూడా పెట్టుడు షురూ జేస్తరు. గందుకే కాంగ్రెసోళ్లను, బీజేపోళ్లను అస్సలు నమ్మొద్దు. నమ్మి ఓటేస్తే జనాన్ని నట్టేట ముంచే రకాలు ఈ కాంగ్రెసోళ్లు. రైతులను మంచిగ జూసుకుంటున్న సీఎం కేసీఆర్ వెంటే మేమంతా ఉంటం. **- పొంద్ర శివకుమార్,ఎలక్ట్రిషన్, ఉట్నూర్.**

### వాళ్ల మాటలు నమ్మితే ఆగమైపోతం..



కాంగ్రెస్ పాలనలో రైతులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొవాల్సి వచ్చింది. కరెంట్ కష్టాలు అన్ని, ఇన్ని కాదు. మూడు గంటల కరెంట్‌తో ఒక్క పంట పండించుకునే పరిస్థితి ఉండేది కాదు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియకపోయేది. పంటలకు నీళ్లు పారించడానికి కరెంట్ మోటర్ల వద్ద పడిగాపులు పడేటోళ్లం. సీఎం కేసీఆర్ అయినాంక మాకు కరెంట్ తిప్పలు తప్పినాయి. ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తున్నది. ఎప్పుడు పడితే అప్పుడు మోటర్ వేసుకొని పంటలకు నీళ్లు పారిస్తున్నాం. రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. వాళ్ల మాటలు నమ్మితే రైతులు ఆగమైపోతారు. హస్తం పార్టీ నాయకులు ఎప్పుడూ రైతులకు వ్యతిరేకమే. వాళ్ల మాటలు విన్న తర్వాత బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని నిర్ణయించుకున్నాం. సీఎం కేసీఆర్ ఉంటేనే రైతులందరికీ మంచి జరుగుతుంది.
**- బండారి ప్రభాకర్. రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం**

# మూడు గంటలతో ముప్పుతిప్పలే

**కాంగ్రెస్ పాలనలో ప్రత్యక్ష నరకం చూపిన్రు..**

- కరెంట్ కోసం వేడుకున్నా కనికరించలే..
- 'హస్తం'ను నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేం ..
- 24 గంటల ఉచిత విద్యుత్‌తో రంది లేకుండా ఉన్నం
- కాంగ్రెస్‌ను నమ్మమంటున్న రైతులు

**కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు** కరెంటుకోసం ముప్పుతిప్పలు పడ్డామని, ప్రత్యక్ష నరకం చూపించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోయేవని, కరెంటో రామచంద్రా అని పాలకులను వేడుకున్నా కనికరించలేదని మండిపడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంటుతో రంది లేకుండా పంటలు తీస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటలు కరెంటు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు వినియోగించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో రైతులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, హస్తం పార్టీ నాయకులను నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం దండుగ అనే పరిస్థితులు ఉండేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల ఫలితంగా పదేళ్లలో వ్యవసాయం పండుగలా మారిందని కొనియాడుతున్నారు. తిరిగి కరెంటు కష్టాలను కొని తెచ్చుకునే పరిస్థితుల్లో లేమని, తమ అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌నే మరోసారి అధికారంలో నిలబెడుతామని స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటుతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు. **- ఆదిలాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ)**

### మూడు గంటలు సరిపోదు



ఇచ్చోడ, నవంబర్ 23 : కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ ఇస్తే పంటలకు పండించేందుకు సరిపోవు. తెలంగాణ వచ్చాక కరెంట్ కష్టాలు తప్పాయి. సాగుకు 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నది. సీఎం కేసీఆర్ సార్ రైతుబంధు, రుణమాఫీ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే రూ.5లక్షల బీమా అందిస్తున్నారు. కాంగ్రెసోళ్లు పంటల సాగుకు మూడు గంటల కరెంట్ సరిపోతుందని చెబితే మళ్లీ కష్టాలు షురూ అయినట్లే. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. ఆ ఖర్చు ఎవరు భరిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చింది. కాంగ్రెస్ మాటలు నమ్మి వ్యవసాయ రంగానికి మేలు చేసేలా లేవు. ఎన్నికల్లో మరోసారి రైతు వ్యతిరేక పార్టీని (కాంగ్రెస్)ను బొందపెడుతాం. కారు గుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్ రుణం తీర్చుకుంటాం.
**- మేకల శ్రీనివాస్, రైతు, మాధపూర్, ఇచ్చోడ మండలం**



### కరెంటియ్యరు..చెయ్యిస్తరు..

నేరడిగొండ, నవంబర్ 23: నా పేరు షేక్ మంజూర్. మాది నేరడిగొండ మండలం. వడూర్ గ్రామం.మేం ఐదుగురు అన్నదమ్ములం. అందరం ఒకే దగ్గర ఉన్నం. మాకు 12 ఎకరాలకు నీటి వసతి ఉంది. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మూడు పంటలు పండిస్తున్నం. రబీలో శనగ, గోధుమ వేసినం.24 గంటలు కరెంటు ఉంటనే మాకు నీళ్ల తడి ఉంటాంది. గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు కరెంటుండేది కాదు. ఎప్పడొస్తదో ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. ఇగ గిప్పుడు ఏదో చేస్తమని పిట్ల కథలు చెబుతున్నరు. అసలు వాళ్లు అధికారంలోకి వచ్చుడనేదే కల. ఇగ గిప్పుడు మూడు గంటల కరెంటు, టెన్ హెచ్‌పీ మోటరంటూ ఉన్న తెలివి బయట పెట్టుకున్నరు. ప్రజలకు మంచి జేసుడు వాల్లకు తెల్వదు. అందుకే ప్రజల మంచి కోరే కేసీఆర్ సారు వెంటే మేమంతా ఉంటం.



### పట్వార్లు వస్తే పనులు కావు..

తాంసి, నవంబర్ 23 : ఇప్పుడు ప్రభుత్వం తెచ్చిన ధరణి వ్యవస్థ మంచిగున్నది. అల్కగా రిజిస్ట్రేషన్లు అవుతన్నయ్. దూరంల ఉన్న ఆఫీసుల చుట్టూ తిరిగే గోస తప్పింది. కానీ కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి ధరణిని బంగాళఖాతంల కలుపుతా అంటున్నడు. ఆ పార్టీకి చెందిన పెద్ద నాయకుడు రాహుల్ గాంధీ కూడా అదే మాట్లాడుతున్నడు. వాళ్లకసలు బుర్ర ఉండి మాట్లాడుతున్నరో నాకైతే సమజైతలేదు. ధరణిని తీసేస్తే పట్వార్లు వస్తరు. మళ్లా లంచం తీసుకొనేటోళ్లు పుట్టుకొస్తరు. మళ్లా కార్యాలయాల కాడనే పడిగాపులు కాయాల్సి వస్తది. అందుకే ఆ పార్టీని నమ్మద్దు. ఓటుతో వాళ్లకు తగిన బుద్ధి చెప్పాలె. మా రైతులంతా బీఆర్‌ఎస్ సర్కార్‌కు మద్దతు. **- గంగుల ప్రవీణ్, బండల్ నాగపూర్**

# ధరణి ఎత్తేస్తే పైరవీకారులదే రాజ్యం

**పైసలు ముట్టజెప్పనిదే ఫైలు ముందుకు కదలదు..**

- పటేల్, పట్వారీ వ్యవస్థలు మళ్లీ పుట్టుకొస్తయ్..
- పట్టా కావాలంటే డబ్బులు ముట్టజెప్పాల్సిందే..
- మళ్లీ పాత పద్ధతిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర

ఆదిలాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ) : ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్న కాంగ్రెస్ తీరుపై కర్షకలోకం భగ్గుమంటున్నది. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పవంటున్నారు. పాత పద్ధతిని తీసుకొచ్చి దళారీ వ్యవస్థను ప్రోత్సహించేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు. పట్టా పాస్‌బుక్‌లో కౌలుదారుని పేరును చేర్చి, రైతుతో సమానంగా వారికి కూడా హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై భయాందోళనకు గురవుతున్నారు. గతంలో తప్పుడు రికార్డుల కారణంగా అసలైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందేవి కావు. దీంతో అనేక మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలు కాంగ్రెస్ పాలనలో చూశామని గుర్తు చేసుకుంటున్నారు. ఇలాంటి సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు సీఎం కేసీఆర్ ధరణిని తేవడంతో రైతుల జీవితాలు బాగుపడ్డాయి.ధరణి ఆధారంగానే రైతుబంధు, రైతు బీమా పథకాలు అన్నదాత ఇంటికి చేరుతున్నాయి. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతన్న ఇంటికే అందేలా.. ధరణి పోర్టల్ రైతులకు ఉపయోగపడుతున్నది. అలాగే భూముల క్రయ, విక్రయాల ప్రక్రియ నిమిషాల వ్యవధిలో పూర్తవడం వంటివి ధరణి కారణంగానే జరుగుతున్నాయి. ఇలా అన్ని విధాలుగా రైతులకు అండగా ఉన్న ధరణిపై కాంగ్రెస్ నాయకులు కుట్రలకు తెరలేపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి రైతుల మధ్య చిచ్చు పెట్టే యత్నాలను తిప్పి కొడతామని ముక్త కంఠంతో నినదిస్తున్నారు.

### ఆళ్ల చరిత్ర ఎరుకే..



ఇంద్రవెల్లి, నవంబర్ 23: కాంగ్రెస్ లీడర్లు ఎట్లుంటరు.. ఆ పార్టీ కథేంటి అనేది రైతులకు తెలిసినట్లు ఇంకెవ్వలకూ తెల్వదు. వాళ్ల అరిగోస పెట్టుకున్నదంటే ముందుగాల రైతులనే. గతంలో ఆఫీసుల్ల పని కావాలంటే లంచం ఇయ్యాల్సి వచ్చేది. గిప్పుడా కథ లేనేలేదు. ధరణి పోర్టల్‌తో ఈజీగా పనులైతున్నయ్. గత ప్రభుత్వాలు ఆ రికార్డులోని పల్లెల్లో గొడవలు, కొట్లాటలు ఉండేయి. కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేసి భూమాత పోర్టల్ తీసుకొస్తమంటున్రు. అది వస్తే రైతుల భూములకు రక్షణ లేకుండా పోతుంది. పాత రోజులు వస్తయ్. రికార్డుల్లో పేర్లు మారుతయ్. ఆఫీసుల చుట్టూ తిరుగుడే అయితది. పైసా లేనిదే పని కాదు. అయినా కాంగ్రెసోళ్లు అప్పుడే కలలుకంటున్రు. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. రైతులమంతా కేసీఆర్‌కు మద్దతు తెలుపుతున్నం. ఎట్లయిన గెలిపించుకుంటం.
**- ఆత్రం హన్నుపటేల్, రైతు, మోడిగూడ**

### ఆళ్లు ఆగం చేస్తరు..



జైనథ్, నవంబర్ 23: ధరణితో రైతాంగానికి ఎంతో మేలు జరిగింది. రైతుల భూములకు రక్షణ ఏర్పడింది. రాష్ట్రం రాక ముందు దళారీలు, పైరవీకారుల రాజ్యం ఉండేది. ఎంతో కొంత ముట్టజెప్పితనే పనులయ్యేది. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. తెలంగాణ ప్రభుత్వం ధరణి తేవడంతో ఆ తిప్పలు తప్పినయ్. భూమి రిజిస్ట్రేషన్ తొందరగా అయిపోతది. ఎవరికీ రుపాయి ఇవాల్సిన అవసరం లేదు. పట్టా దారు పాసుబుక్ ఇంటికే వస్తది. ధరణి తీసేస్తే మళ్లీ పాత పరిస్థితి వస్తది. రైతులకు కష్టాలు మొదలైతయ్. పైసల్లేకుండా ఏ పనీ కాదు. ఇంత మంచిగున్న ధరణిని తీసివేస్తామన్న కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరు. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ఏం జరుగుతదో అందరికీ తెలుసు. అయినా వీళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. రైతులను ఆగం చేసేటోళ్లు మన నెత్తిమీదెందుకు..? మళ్లోసారి సీఎం కేసీఆరే రావాలె.
**- బాస మాధవ్, కరంజి, జైనథ్ మండలం**



### నాటి గోస మర్సిపోలె..

ఇంద్రవెల్లి, నవంబర్23: నాడు భూముల విషయంలో పడిన గోస మర్సిపోలే. పాతపద్ధతిల రికార్డులతోని ఇబ్బందయ్యేది. గిప్పుడు ధరణి పోర్టల్ మంచిగున్నది. అంతా ఆన్‌లైన్లనే కావట్టి, భూములకు రక్షణ ఉంటది. మీ సేవకు సక్కగా పహాణీలు చూసుకుంటున్నం. మళ్లా పాత పద్ధతంటే దళారీ రాజ్యం వస్తది. ఇగ కాగితాల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాలె. ధరణి వచ్చిన తర్వాత ఒకే దగ్గర మ్యూటేషన్, రిజిస్ట్రేషన్లు అయిపోతున్నయ్. రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చూట్టూ తిరిగే బాధలు తప్పినయి. ధరణి రద్దు చేస్తమంటున్న కాంగ్రెస్ మనకు అవసరం లేదు. ఆ పార్టీకి ఓటేస్తే మళ్లీ ఎనకటి రోజులు వస్తయ్. రైతుల సంక్షేమం కోసం పాటుపడే కేసీఆర్ ప్రభుత్వం గాక వేరే ఏది వచ్చినా రైతుల బతుకులు ఆగమైతయ్. రైతులను అన్ని విధాలా ఆదుకొనే బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్ ప్రభుత్వానికే నా మద్దతు. **- అన్వర్-హీరాపూర్ రైతు**

### అవకాశం ఇస్తే ఆగం చేస్తరు..



గుడిహత్నూర్, నవంబర్ 23: ధరణిని తెచ్చినంక పైరవీకారులు, రెవెన్యూ అధికారుల అక్రమాలకు చెక్ పడింది. ధరణికి ముందు పల్లెల్లో పైరవీకారులు, వీఆర్‌వోలు, రెవెన్యూ అధికారులు ఆడిందే ఆటగా సాగింది. నాడు రైతుల పేర్లు, సర్వే నంబర్లు మార్చి అరిగోస పెట్టిన్రు. భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ నెలలపాటు తిరిగేది. ఒక్కోసారి రెవెన్యూ అధికారులను కార్యాలయంలో బంధించిన సందర్భాలు ఉండేవి. ధరణి రావడంతో రైతుల బాధలు తీరినయ్. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా పోయినయ్. కాంగ్రెస్, బీజేపీలకు అవకాశం ఇస్తే ఆగం చేస్తరు. ధరణిని తీసేస్తమని చెబుతున్రు. అట్లయితే రాబందుల రాజ్యం మళ్లీ మొదలైతది. అందుకే రైతులందరూ సమష్టిగా ఉంటం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లెయ్యం. **-కేశవ్ గిత్తె రైతు మన్నూర్**

### చెయ్యివి చెడగొట్టు పనులే..



ఉట్నూర్ రూరల్, నవంబర్ 23 : కాంగ్రెస్ పార్టీ చెడగొట్టు పనులు చేసే విధంగా మాట్లాడుతోంది. ధరణి పోర్టల్ వల్ల రైతులకు మంచి జరిగితే కాంగ్రెస్ నాయకులకు మంచిగా అనిపిస్త లేదు. కాంగ్రెస్ మళ్లీ పటేల్, పట్వారీ కాలం నాటి రెవెన్యూ వ్యవస్థను తీసుకొచ్చేలా మాట్లాడుతున్నారు. అప్పట్లో పహాణీ, నఖలుకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ ప్రారంభించినంక తమ భూములు ఆన్‌లైన్‌లో ఎక్కడం వల్ల ఇబ్బందులు తప్పినయి. ఇంత మంచి ధరణిని తీసి వేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడడం బాధాకరం.
**- రాథోడ్ వెంకట్‌రాం, రైతు, కొత్తగూడ గ్రామం, ఉట్నూర్ మండలం**



### పట్టాదారులకు శంకరమాన్యాలే..

సొనాల, నవంబర్ 23 : ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ధరణి ఫోర్టల్‌ను రద్దు చేస్తే పూర్వకాలం నాటి పైరవీల రాజ్యం వస్తుంది. దళారుల ప్రమేయం పెరిగి రైతుల భూములను గోల్‌మాల్ చేసే అవకాశం ఏర్పడుతుంది. రైతుల మధ్య అగాధం పెంచేందుకు కాంగ్రెస్ వాళ్లు ప్రయత్నం చేస్తున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే మళ్లీ రైతులకు గోస మొదలైనట్లే. పట్టాదారు స్థానంలో తిరిగి అనుభవదారు, మాన్యందారు కాలమ్‌లు పెట్టడంతో నిజమైన పట్టాదారుకు తిప్పలు తప్పవు. రోజుల తరబడి అధికారులు, లీడర్ల చుట్టూ తిరిగే రోజులు మళ్లీ వస్తాయి. భూ సమస్య లేకుండా ఉండాలంటే ధరణి ఉండాల్సిందే. **- బండారి రఘు, రైతు, సొనాల**